క్లుప్తంగా

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న పర్యాటకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలకు ఆదివారం సందర్శకులు భారీగా తరలివచ్చారు. తిక్కవానిపాలెం తీరంలో ఎన్టీపీసీ జెట్టీ, జీడి, సరుగుడు తోటల్లో విడిది చేసి ఆట పాటలతో గడిపారు. సాయం సంధ్యా సమయంలో తీరంలో జలకాలాటలతో ఉత్సాహంగా గడిపారు. ముత్యాలమ్మపాలెం తీరంలో యువకులు ఎంజాయ్ చేశారు. ఈ తీరంలో సౌకర్యాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

వరినారుకు సస్య రక్షణ అవసరం



మల్లు నాయుడుపాలెంలో వరి నారుమడులను పరిశీలిస్తున్న ఏవో సత్యనారాయణ

సబ్బవరం: ఖరీఫ్ సీజన్‌లో వేసిన వరినారులో సస్యరక్షణ అవసరమని ఏవో పోతల సత్యనారాయణ తెలిపారు. నారు వేసి 10 నుంచి 15 రోజులు అయిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నారుమడుల్లో తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. జింకు, ఇనపధాతు లోపాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆకులు పసుపు వర్ణంలోకి మారి ఇటుక రంగు మచ్చలతో ఉంటే జింకు ధాతు లోపంగా గుర్తించాలన్నారు. దాని నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలన్నారు. ఆకులు పాలిపోయి తెల్లగా మారి ఉంటే ఇనపధాతులోపంగా గుర్తించి రెండు గ్రాముల అన్నబేదితో పాటు రెండు గ్రాముల నిమ్మ ఉప్పు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఈడీ



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న ఈడీ రవికుమార్

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆదివారం సాయంత్రం ఏపీఎస్ ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ సందర్శించారు. బస్‌స్టేషన్‌లో స్టాల్స్, పార్సిల్ పాయింట్‌ను తనిఖీ చేశారు. పార్సిల్ పాయింట్‌ను ప్రయాణికులు, వ్యాపారస్తులు, సింహాచలం పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పార్సిళ్లు జాగ్రత్తగా తీసుకువెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. అలాగే క్రాస్ రోడ్డులో పార్సిల్ పాయింట్ బుకింగ్ అండ్ డెలివరీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తులసి, కొండలరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వాల్మీకి రామాయణ పారాయణ



సామూహిక పారాయణలో భక్తులు

సింహాచలం: సప్తగిరి నగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో ఆదివారం వాల్మీకి రామాయణ సామూహిక పారాయణ ఘనంగా జరిగింది. అష్టలక్ష్మి పీఠాధిపతులు శ్రీమాన్ పీతాంబరం రఘునాథ స్వామి, మాస్టర్ ఇ.కె. ఆధ్యాత్మిక సేవా సంస్థ ప్రతినిధి ఎక్కిరాల సుదర్శన్, ఆలయ అర్చకుడు శ్రీమాన్ మార్గపురి మణిబాబు, ఆలయ కమిటీ ప్రధాన అర్చకుడు మార్గపురి సంపత్ కుమార్, జగన్నాథం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలరించిన కోలాటం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీవారి భక్తులు నిర్వహించిన కోలాటం అలరించింది. సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

మలుపుల మాటున ముప్పు!



పరవాడ ఊరచెరువు మలుపులో ఢీకొన్న ద్విచక్ర వాహనాలు



రాముడుగారి గ్రామం వద్ద ప్రమాదకరమైన మలుపు

పరవాడ: మండలంలోని పలు రహదారుల్లోని మలువులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. ముఖ్యమైన రహదారుల్లోని మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో తరచూ ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు.

- వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం వరకు గల మూడు కిలోమీటర్ల రహదారిలో సుమారు 11 ప్రమాదకర మలుపులు ప్రయాణికులను భయపెడుతున్నాయి.
- గాజువాక-యలమంచిలి రహదారిలో పరవాడ పోలీస్ స్టేషన్ వద్ద మలుపులో గతంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- పరవాడ మండల కాంప్లెక్సు కూడలి, సినిమా హాలు కూడలి మలుపు, ఊటగెడ్డ మలుపు, పెద ముసిడివాడ మలుపు, పరవాడ-అనకాపల్లి రహదారిలో భర్నికం వద్ద మలుపు, పరవాడ-తానాం రహదారిలో ఊర చెరువు వద్ద మలుపు, దేశపాత్రునిపాలెం వద్ద మలుపులు ప్రయాణికులను మరింత భయపెడుతున్నాయి.
- ఇటీవల పరవాడ ఊరచెరువు మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనచోదకులు ఢీ కొట్టుకోవడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. - ముత్యాలమ్మపాలెం రహదారిలో వాహనాల వేగాన్ని తగ్గించకుండా రాకపోకలు సాగించడం వలన నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

రోడ్లపై మెటీరియల్‌తో..

గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక, పిక్క వంటి మెటీరియల్ రోడ్లపై వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రమాదకరమైన మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు వేగంగా నడుపుతున్న వాహనచోదకులపై కేసులు నమోదు చేస్తున్నాం. మలుపుల్లో హెచ్చరిక బోర్డుల విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతాం. అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– పి.ఈశ్వరరావు, సీఐ పరవాడ

వైభవంగా ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం ..శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల ఈకార్యక్రమం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనంతో క్రతువు ప్రారంభించారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు సుజాతనగర్‌లోని ఆర్‌కే కల్యాణ మండపంలో ఆదివారం తెలంగాణ బ్రాహ్మణ అభ్యుదయ సమాజం ఆధ్వర్యంలో అలివేలు మంగ సహిత శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్ల, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు స్వామిని దర్శించుకున్నారు. తెలగాణ బ్రాహ్మణ అభ్యుదయ సమాజం అధ్యక్షుడు కె.విశ్వనాథం, కార్యదర్శి పి.రాప్రసాద్, కోఆర్డినేటర్స్ ఎస్.ఎస్.శాస్త్రి, ఇనిగంటి రాజా శ్రీనివాస్, బి.వెంకటేశం, జి.ఎస్.ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ దశల వారీ ఆందోళన

డాబాగార్డెన్స్ : విద్యుత్ ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహించింది. సిటు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు యూనియన్ల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఏపీ విద్యుత్ సంస్థలో ఉద్యోగులు/కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం, విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్, పీస్‌రేట్, కార్మికుల ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి ఈ నెల 26న విజయవాడలో వేలాది మందితో నిర్వహించిన రాష్ట్ర సదస్సు విజయవంతమైందన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీ ఆందోళనలకు, పోరాటాలకు పిలుపునిచ్చిందన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని, విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పీస్ రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్ల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సమావేశంలో తీర్మానించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 10 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్. సత్యారావు, వేపాడ సత్యనారాయణ, పి. శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్‌కే రెహ్మాన్, సాయి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి

కలెక్టర్ మల్లికార్జున



మధురవాడ వసంత విహార్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మధురవాడ: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది రిక్షా కాలనీ, వసంత విహార్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఇంటింటా ఓటరు సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు డోరు టు డోర్ సర్వేపై అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఓటు నమోదు చేయించుకున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేయించుకుని ఎన్నికల్లో భాగస్వాములు కావాలని కోరారు. సవరణలు కావాలనుకునే వారు ఫారమ్ 8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, చనిపోయిన వారి ఓట్లు విచారణ తర్వాత తొలగించాలని సిబ్బందికి చెప్పారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుపై బూత్ లెవెల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి పరిధిలో ఉన్న కాలేజీల్లో కూడా ఓటు హక్కులేని వారి వివరాలు నమోదు చేయించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. కుటుంబంలోని సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో నమోదయ్యేలా చూడాలని బీఎల్‌వోలు, అధికారులను ఆదేశించారు. అర్బన్ ప్రాంతంలో 1400, రూరల్‌లో 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం కొత్త బూత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లో నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను బూత్‌లుగా వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాను అధికారులతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించి మార్పులు ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం ఇక్కడ వీధిలైట్లు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరగా దానిపై కలెక్టర్ మల్లికార్జున సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య, ఏఈఆర్‌వో నరేంద్రనాథ్ రెడ్డి, సూపర్‌వైజర్ కల్యాణి, శ్రీహరి, మల్లేశ్వరరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి శివారు సున్నంబట్టీలు వద్ద ఈనెల 28న జరిగిన చోరీ కేసులో నలుగురు నిందితులను ఆదివారం అరెస్టు చేసి అనకాపల్లి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రంగనాథం తెలిపారు. వారి నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు రికవరీ చేశామని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిలో మేకల యేసు, పాల వేణు, గొర్లి రమణి, పాల లక్ష్మి ఉన్నారని సీఐ రంగనాథం తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

పరవాడ: మండలంలోని మడకపాలెం, మంత్రిపాలెం గ్రామాల శివారు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెండు పేకాట శిబిరాలపై పరవాడ పోలీసులు ఆదివారం దాడులు జరిపి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు.. మంత్రిపాలెం శివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి సిబ్బందితో దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 4600 నగదు స్వాధీనం చేసుకున్నారు. మంత్రిపాలెం లారీ యార్డులో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు సిబ్బందితో ఆదివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈశ్వరరావు చెప్పారు.

నేడు బ్రాహ్మణ, పురోహితుల ఆత్మీయ సదస్సు

సింహాచలం: విశాఖ కేంద్ర బ్రాహ్మణ అర్చక, పురోహిత సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం బ్రాహ్మణ, అర్చక, పురోహితుల ఆత్మీయ సదస్సు వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులోని వి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త విజయ్‌కుమార్‌శర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో అర్చక, పురోహితుల సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఏకగ్రీవ తీర్మానం చేస్తామన్నారు. విశాఖలోని అన్ని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

గౌతు లచ్చన్న స్మారక భవనం ఏర్పాటుకు వినతి



ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీశయన కులస్థులు

డాబాగార్డెన్స్ : బీసీల పక్షపాతి గౌతులచ్చన్న పేరిట విశాఖలో స్మారక భవనం ఏర్పాటు చేయాలని విశాఖ శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీశయన కులస్థులకు ఏ సమస్య వచ్చినా సంఘం తరఫున చెప్పుకోవడానికి విశాఖలో ఎటువంటి సామాజిక భవనం లేనందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన శ్రీశయన కులస్థుల సంక్షేమానికి కృషి చేయాలని, వివాహ వేడుకలు నిర్వహించుకునేందుకు 50 సెంట్ల భూమి కేటాయించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీశయన సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



సేంద్రియ ఎరువు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

పరవాడ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగులో రసాయనిక ఎరువుల స్థానంలో పకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధి మహాలక్ష్మి అన్నారు. తానాం గ్రామంలో రైతు పైల రామారావు ఆధ్వర్యంలో పకృతి వ్యవసాయ విస్తరణ, శిక్షణా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంట ఎదుగుదలకు వృద్ధి ద్రావణాలు వినియోగించాలని సూచించారు. పురుగు మందులకు బదులు అందుబాటులో ఉండే కషాయాలు ఉపయోగించి తక్కువ పెట్టుబడితో పంటలు పండించవచ్చునన్నారు. మీణామృతం తయారు చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. మీణామృతం తయారు చేయడానికి 200 లీటర్ల డ్రమ్ములో 5 కిలోల చేప వ్యర్థాలు, 5 కిలోల బెల్లం, 5 లీటర్ల ఆవు మూత్రం తీసుకొని పొరలు, పొరలుగా వేసుకోవాలన్నారు. డ్రమ్ములో వేసిన వాటిని ఉదయం, సాయంత్రం కలపాలన్నారు. 25 రోజుల తర్వాత మీణామృతాన్ని వడకట్టి పంటపై పిచకారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మోహన్, సంతోష్, బలరాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనది



మల్లేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న గురుకుల పాఠశాలల అధ్యాపకులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పౌరశాస్త్ర అధ్యాపకుడి కర్రి మల్లేశ్వరరావు పదవీవిరమణ సన్మానసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖపట్నం,అనకాపల్లి జిల్లాల సమన్వయ అధికారి ఎస్. రూపావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33 ఏళ్ల పాటు మల్లేశ్వరరావు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదన్నారు. మల్లేశ్వరరావు దంపతులను ప్రిన్సిపాల్ విజయకుమార్, శ్రీకాకుళం జిల్లా సమన్వయ అధికారి ఎస్. బాలాజీ నాయక్, అధ్యాపకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జోనల్ అధికారి జనార్దనరావు, సబ్బవరం గురుకుల పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి. శేషకుమారి, రిటైర్డ్ సమన్వయ అధికారి ఆర్‌డీవీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పెందుర్తి డివిజన్ కార్యవర్గం ఎన్నిక



రామునాయుడును అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

సింహాచలం: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పెందుర్తి డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పెందుర్తి డివిజన్ నూతన అధ్యక్షుడిగా గొర్లె రామునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా రిలే వాసు, ట్రెజరర్‌గా మీసాల రాంబాబు ఎన్నికయ్యారు. గత అధ్యక్షుడు రత్నశేఖర్ నుంచి రామునాయుడు బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్స్, కార్యవర్గ సభ్యుల పేర్లు కూడా ప్రకటించారు. ఈ సందర్భంగా రామునాయుడుకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.క్లబ్ నూతన మెంబర్స్ పీల రాజబాబు, నాదెళ్ల జ్యోతిని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆళ్లపాటి సుబ్బారావు, దుర్గాప్రసాద్, రీజనల్ చైర్మన్ సత్యానంద్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మిక కుటుంబాలకు భరోసా కరవు



899వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం భరోసా లేకుండా చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 899వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో నిరసన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం చూసీచూడనట్టుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం కార్మికవర్గానిదేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకుని, పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సీఎం దృష్టికి పోర్టు కార్మికుల సమస్యలు



దీక్షా శిబిరంలో కూర్చున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుతంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరికాదని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్ ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరవధిక దీక్షలు ఆదివారం 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్మికుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో పలు దఫాలు చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దీనిపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి సాయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. స్పందించిన సీఎం వెంటనే చీఫ్ సెక్రటరీతో చర్చించారని, త్వరలోనే యాజమాన్యంతో మాట్లాడనున్నారని తెలిపారు. వచ్చే నెల 1న విశాఖ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో ఈ విషయమై కార్మికులతో మాట్లాడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, నొల్లి తాతారావు, వాసుపిల్లి ఎల్లాజీ, మాద అప్పారావు, నొల్లి స్వామి, లక్ష్మయ్య, సత్యానందం పాల్గొన్నారు.

రచయిత విహారితో సాహితీ గోష్టి



విహారి దంపతులను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: కవి, కథా రచయిత విహారితో ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాహితీ గోష్టి జరిగింది. విశాఖ సాహితి సంస్థ అధ్యక్షులు ఆచార్య మలయవాసిని అధ్యక్షత వహించారు. రావి శాస్త్రి పురస్కారం అందుకోనున్న విహారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విహారి కథకుడిగా, విమర్శకుడిగా తెలుగు సాహిత్యానికి గొప్ప సేవలందించారని ప్రశంసించారు. సాహిత్య గోష్టిలో పలువురు అడిగిన ప్రశ్నలకు విహారి సమాధానాలు చెప్పారు. కథా రచనలో మెళకువలు, కథన శిల్పంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చారిత్రక, పౌరాణిక నవలలు రాయడంలో ఉండే ఇబ్బందులను విశ్లేషించారు. ఎవరు ఏ వాదంతో రాసిన మానవతా వాదం అన్నింటి కంటే గొప్పదని పేర్కొన్నారు. రచయిత సమాజ పోకడలను అర్థం చేసుకుని ప్రాచీన సాహిత్యాన్ని ఇప్పటి వాదాలతో పరిశీలించకూడదన్నారు. రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సంప్రదాయ, అభ్యుదయ మార్గాలకు వారధిగా విహారిని అభివర్ణించారు. అనంతరం విహారి దంపతులను ఘనంగా సత్కరించారు. సాహితీవేత్తలు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, జె.పి.శర్మ, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.